క్లుప్తంగా

ఏఐటీయూసీని గెలిపించినందుకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించి గెలిపించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాపాడడానికి, కలిసికట్టుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ యూనియన్ నాయకులు అక్బర్ అలీ, సుదర్శన్, శ్రీనివాస్, ఆంజనేయులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెన్నెల: మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెన్నెల మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ(ఎఫ్‌పీసీ)నందు పనిచేయుటకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి(సీఈఓ) పోస్టు కోసం అర్హులైన వారు ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం విజయలక్ష్మి, ఎఫ్‌పీసీ చైర్మన్ తారా తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు నెన్నెల మండలానికి చెందిన వారై ఉండాలని, అగ్రికల్చర్ డిప్లమో, అగ్రికల్చర్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ చేసిన వారై ఉండాలన్నారు. వయస్సు 35సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. నెలకు రూ.15వేల వేతనంతో పాటు టీఏ ఇవ్వబడునన్నారు. దరఖాస్తు చేసుకునేవారు ఈ ఫోన్ నంబర్లలో 9177202636, 9652613020 సంప్రదించాలని కోరారు.

శ్రమదానం



భీమారం: స్థానిక శ్రీకోదండ రామాలయం ఆవరణలో గురువారం యువకులు శ్రమదానం చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా చెత్తను తొలగించినట్లు తెలిపారు.



న(క)ష్టాల.. ఎవుసం

2023 రివైండ్



జిల్లాలో వానాకాలం సాగు విస్తీర్ణం ఎకరాల్లో...

- కర్షకులకు కన్నీళ్లు మిగిల్చిన సాగు
- కాలం కలిసి రాక.. పంటకు ధర రాక ఇబ్బందులు
- రుణమాఫీ, యాసంగి రైతుబంధు కొందరికే..

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని కర్షకులకు ఈ ఏడాది వ్యవసాయం కన్నీళ్లు మిగిల్చింది. రైతన్నను నష్టాల ఊబిలోకి నెట్టింది. వర్షాభావ పరిస్థితుల్లో ఉన్న కొద్దిపాటి భూమిలో సాగుచేద్దామంటే బ్యాంకులు రుణాలియ్యక, పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రకృతి వైపరీత్యాలు, పెరిగిన పెట్టుబడులు, చీడపీడల వ్యాప్తి, రాని దిగుబడి, కొనుగోలు కేంద్రాల్లో ఎదురుచూపులు, నీటిపాలైన పంటలు, మిగిలిన అప్పులు శరమాములుగానే మారాయి. వానాకాలం సాగు ఆరంభంలో దుక్కులు దున్ని విత్తనాలు వేసుకునేందుకు చినుకు రాలక దిక్కులు చూడాల్సి వచ్చింది. జూన్ నెల చివర్లో నైరుతి రుతుపవనాలు తాకి తొలకరి వర్షాలు కురవడంతో విత్తనాలు వేసుకున్నారు. పంట ఎదిగే సమయంలో ఎడతెరిపిలేని భారీ వర్షాలతో వేల ఎకరాల్లో పత్తి, వరి పంటలు నీటమునిగి నష్టపోయారు. అరకొర దిగుబడి వచ్చినా, పంటకు ఆశించిన ధర రాక దిగులు చెందుతున్నారు.

ముంచెత్తిన జులై..

జిల్లాలో ప్రధానంగా పత్తి, వరి పంటలు వేసుకున్నారు. పంట ఎదిగే దశ జులై నెల 18వ తేదీ నుంచి 28వరకు జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షాలు, వరదలతో వాగులు వంకలు పొంగిప్రవహించాయి. చెరువులు, కుంటలు నిండుకుండలను తలపించాయి. జలాశయాల్లో భారీ వరదనీరు చేరుకోవడంతో దిగువ ప్రాంతానికి వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. వరదలతో లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాలు నీటమునిగాయి. పత్తి, వరిపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో 45వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక సర్వేలో గుర్తించారు. కానీ నష్టపోయిన రైతులకు పరిహారం మాత్రం రాలేదు.

కీలక దశలో వర్షాలు లేక..

ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో వరి పొట్టదశ, పత్తి పూత, కాత కీలక సమయాల్లో వర్షాలు కురవకపోవడం, ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు భగ్గుమన్నాయి. దీంతో వరి పొలాలు నెర్రలుబారాయి, పత్తి పంట ఆశించిన కాత లేకపోగా కొన్నిచోట్ల మొక్కలు ఎండిపోయాయి. పంట దిగుబడి సగానికి తగ్గిపోయింది. పంటలకు కీలకమైన సమయం సెప్టెంబర్ నెలలో వర్షాలు లేక ఎకరానికి 12నుంచి 14క్వింటాళ్ల దిగుబడి రావాల్సిన పత్తి పంట 4నుంచి 6క్వింటాళ్లకు మించి రాలేదు.

యాసంగి సాగు ఆలస్యం

యాసంగి సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. జిల్లాలో యాసంగి సాగు మందకొడిగా సాగుతోంది. సీజన్ ఆరంభమై రెండు నెలలు గడుస్తున్నా పంటల సాగు 50శాతం కూడా పూర్తి కాలేదు. ఈ సీజన్‌లో 1.10లక్ష ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ అధికారులు అంచన వేశారు. కానీ ఇప్పటివరకు కేవలం 28వేల ఎకరాల్లో మాత్రమే సాగయ్యింది. వరిసాగు కొంత ఆలస్యమైనప్పటికీ ఆరుతడి పంటలు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు.

గిట్టుబాటు కాని ధర..

పత్తికి మద్దతు ధర క్వింటాళుకు రూ.7,020 నిర్ణయించగా ఈ ఏడాది పత్తి సీజన్ ఆరంభం నవంబర్ నెలలో రూ.7వేల వరకు చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ సమయంలో పత్తి మార్కెట్లోకి రాలేదు. డిసెంబర్ రెండోవారం నుంచి ఒకేసారి దిగుబడి వస్తుండడంతో వ్యాపారులు ధర తగ్గించారు. దీంతో రైతులు (సీసీఐ) ప్రభుత్వ రంగ సంస్థ వైపు చూడడంతో ఆన్‌లైన్ ఆధార్‌కార్డు అప్‌డేట్, ఇతర ధ్రువీకరణ పత్రాలతో పాటు తేమ, రంగు నిబంధనల పేరిట కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. 8నుంచి 12శాతం, తేమ లోబడి ఉన్న పత్తికి రూ.7వేల నుంచి రూ.6800ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు సిండికేట్‌గా మారి క్వింటాళుకు రూ.6500 నుంచి రూ.6700 వరకు చెల్లిస్తున్నారు. దీంతో రైతులు మద్దతు ధర రాక నష్టపోతున్నారు.

రుణమాఫీ, రైతుబంధు కొందరికే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 డిసెంబర్ 7వరకు లక్ష మాఫీ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో 93,474మంది అర్హులైన రైతులు ఉండగా మొదట రూ.25వేల లోపు ఉన్న రైతులకు, ఆ తర్వాత, రూ.50వేల చొప్పున నగదు జమ చేయగా.. ఆ తర్వాత లక్ష మాఫీ ఈ ఏడాది అక్టోబర్ నెలలో మాఫీ నిధులు విడదల చేసింది. ఇప్పటివరకు 52,597మందికి మాత్రమే మాఫీ సొమ్ము ఖాతాల్లో జమ అయ్యింది. ఇంకా 39,877మంది రైతులకు రుణమాఫీ నగదు జమ కాలేదు. దీంతో రైతులు వ్యవసాయ, బ్యాంకుల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. డిసెంబర్‌లో 6న కొత్త ప్రభుత్వం రావడంతో ఈ నెల 12నుంచి యాసంగి రైతుబంధు నిధులు విడుదల చేసింది. జిల్లాలో రైతుబంధు పథకానికి గాను 1,52,589మంది రైతులకు గాను రూ.162,60,24,480జమకావాల్సి ఉండగా ఇప్పటివరకు 54,369మందికి గాను రూ.15,28,64,836మాత్రమే నగదు జమ అయ్యింది. ఈ యాసంగి ఎకరం లోపు రైతులకు మాత్రమే నగదు జమ అయ్యింది. రైతుబంధు కోసం చిన్న,సన్నకారు రైతులు నిరీక్షిస్తున్నారు.

వ్యాసరచన పోటీలు



శివనందినికి జ్ఞాపిక అందజేస్తున్న సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు పురస్కరించుకుని భగత్‌సింగ్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలకు 50మంది విద్యార్థులు హాజరయ్యారు. పదోతరగతి చదువుతున్న శివనందిని ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారు. సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్ చేతుల మీదుగా మెమెంటోలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి పాల్గొన్నారు.

రాముని చెరువు పనులు పూర్తిచేయాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాముని చెరువు అభివృద్ధి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని రామునిచెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సభ్యులు జి.లక్ష్మణ్, సీహెచ్. పోశం, సాంబమూర్తి, భూమయ్య, జగదీశ్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన

జన్నారం: మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో డీటీడబ్ల్యూవో గంగారాం ఆదేశాల మేరకు ప్యానల్ సందర్శించారు. ప్యానల్ టీం లీడర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో భౌతిక, మానవ వనరుల పరిశీలన, ఉపాధ్యాయుల బోధన విషయాలను పరిశీలించారు. సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సీవీ రావు, హెచ్‌డబ్ల్యూవో అనసూయ, ప్యానల్ సిబ్బంది శ్యాంరావ్, మహేశ్వర్‌రెడ్డి, రాజ్యలక్ష్మి, సత్యప్రియ, ధనలక్ష్మి, మంజుల, పద్మజ, సునీత పాల్గొన్నారు.

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిని కలిసిన రమేశ్

మందమర్రిరూరల్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిను గురువారం నాగపూర్‌లో చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ మెంబర్ సూకల రమేశ్ కలిసి పుష్పం అందించి, శాలువాతో సన్మానించారు. తెలంగాణ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు.

‘ప్రజాపాలన’ దరఖాస్తుల స్వీకరణ

- హాజరైన అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డిప్యూటీ కలెక్టర్ సిడాం దత్తు
- సద్వినియోగం చేసుకోవాలని సూచన



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

భీమారం/భీమిని/కోటపల్లి/మందమర్రిరూరల్/చెన్నూర్: ప్రభుత్వ పథకాలు అందించే లక్ష్యంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్, మోతీలాల్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం కోటపల్లి మండలం నక్కలపల్లిలో, చెన్నూర్ 10వ వార్డులో, భీమారం మండలం నర్సింగాపూర్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, మందమర్రి, కన్నెపల్లి మండలాల్లో అదనపు కలెక్టర్ మోతీలాల్ దరఖాస్తులు స్వీకరించి ప్రారంభించా రు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో, గ్రామాల్లో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, వారం రోజుల పాటు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. దరఖాస్తులు అందజేసిన తర్వాత అధికారులు ఇచ్చే రశీదులను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోటపల్లి, చెన్నూర్, భీమారంలో డీఆర్‌డీవో శేషాద్రి హాజరయ్యారు. మందమర్రిలో నాలుగు గ్రామ పంచాయతీల్లో 250, మున్సిపాలిటీలో 800వరకు దరకాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో చెన్నూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్ గిల్డా, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ నవాజ్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కౌన్సిలర్లు, పాల్గొనగా, కోటపల్లిలో ఎంపీపీ మంత్రిసురేఖా, ఎంపీడీవో భాస్కర్, ఏవో మహేందర్, సర్పంచ్ స్రవంతి, మందమర్రిలో మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, తహసీల్దార్ చంద్రశేఖర్, స్పెషన్ ఆఫీసర్ సీపీవో సత్యం, ఎంపీడీవో శశికళ, ఎంపీవో భీరయ్య, ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ వేల్పుల రవి, భీమారంలో జెడ్పీటీసీ బుక్యా తిరుమల, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని నందులపల్లి, గన్‌పూర్, మన్నెగూడం, జోగాపూర్ గ్రామాల్లో అదనపు కలెక్టర్ మోతిలాల్, డెప్యూటీ కలెక్టర్ సిడాం దత్తు, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామలదేవి ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 4పంచాయతీలలో మొదటి రోజు 721దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంపీఓ శ్రీనివాస్, విద్యుత్ ఏఈ మల్లయ్య, ఏపీఓ నరేష్ పాల్గొన్నారు.



అక్కెపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



రామకృష్ణాపూర్‌లో...



భీమారం మండలం బూర్గుపల్లిలో...



బెల్లంపల్లిరూరల్: మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

‘ప్రజాపాలన’కు స్పందన

భీమారం/రామకృష్ణాపూర్/చెన్నూర్‌రూరల్/జన్నారం/వేమనపల్లి/బెల్లంపల్లిరూరల్/లక్సెట్టిపేట/దండేపల్లి/జైపూర్/తాండూర్/కాసిపేట: ఆరు గ్యారంటీల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మొదటి రోజు గురువారం దరఖాస్తు ఇచ్చేందుకు ప్రజలు బారులు తీరారు. ఆయా గ్రామ పంచాయతీల్లో, మండల కేంద్రాల్లో, పట్టణాల్లో, వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



జన్నారం: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



మేదరిపేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



వేమనపల్లిలో...



జైపూర్ మండలం ఇందారంలో...



మామిడిగూడలో స్వీకరిస్తున్న గంగారాం

బెల్లంపల్లిలో...



దరఖాస్తు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్, ఆర్డీవో

బెల్లంపల్లి: ప్రజాపాలన గురువారం బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌లో ప్రారంభమైంది. మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ భుజంగరావు, బెల్లంపల్లి డివిజన్ నోడల్ అధికారి, ఆర్డీవో హరికృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలిరోజు డివిజన్ వ్యాప్తంగా 3,996దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో 1,642 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా వేమనపల్లి మండలంలో కేవలం 76దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కార్యక్రమంలో ఏడీఏ ఎల్తూరి సురేఖ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు సూరం సంగీత, ప్రభాకర్, నారాయణ, కృష్ణ, మున్సిపల్, రెవెన్యూ, పౌరసరఫరాలు, విద్య, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నస్పూర్ మున్సిపాలిటీలో...



టెంట్ కింద దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బంది

నస్పూర్: ఆరు గ్యారంటీల అమలులో భాగంగా అర్హులను గుర్తించడానికి చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గురువారం పట్టణంలో ప్రారంభం అయ్యింది. మున్సిపాలిటీ పరిధిలోని 25వార్డుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు. 12వ వార్డులోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కమిషనర్ రమేశ్ ఉన్నారు.

12వ వార్డు కేంద్రం వద్ద వసతుల కరువు

12వ వార్డులో తాళ్లపల్లి ఆర్అండ్ఆర్ ప్లాట్స్ ప్రాథమిక పాఠశాల భవనం వద్ద కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ భవనం నిర్మించి 5సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అది నేటివరకూ ప్రారంభం కాకపోవడంతో, పాఠశాల ఆవరణలో ముళ్లపొదలు పెరిగాయి. గదులకు తాళాలు వేసి ఉండడంతో సిబ్బంది ఆరుబయట ఓ టెంటు వేసుకుని దరఖాస్తులు స్వీకరించారు. మరోచోటుకి ఈ కేంద్రాన్ని మార్చాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేశారు.

‘ప్రజాపాలన’ ప్రారంభంలో ఇబ్బందులు



హమాలీవాడలో గుమిగూడిన ప్రజలు



లేబర్ కాలనీలో ఫారాల కోసం ఎగబడుతున్న జనం

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించాల్సిన పథకాల కోసం గురువారం నుంచి ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభ ఇబ్బందులతో ప్రారంభం అయ్యింది. ప్రజాపాలన సభ ద్వారా మహాలక్ష్మీ, గృహజ్యోతి, చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మంచిర్యాల మున్సిపాలిటీలోని 36వార్డుల్లో ప్రారంభించారు. ముందురోజే దరఖాస్తులను ప్రజలకు ఇస్తారని ప్రచారం జరిగినా, అందించలేకపోయారు. దీంతో సభ వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి దరఖాస్తుల కోసం ఎగబడ్డారు. సభ వద్ద కొన్ని చోట్ల ఏర్పాట్లు చేయకపోవడంతో ఉదయం 8గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, 10గంటలకు సభను ప్రారంభించారు. మొదటి రోజు కావడంతో దరఖాస్తులు తీసుకున్నవారు సభలో అందించలేకపోయారు. మంచిర్యాల మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించగా, మిగితా వార్డుల్లో వార్డు కౌన్సిలర్లు, వార్డు ఆఫీసర్లు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



జైపూర్: రక్తదానం చేస్తున్న యువకులు

మంచిర్యాలటౌన్/జైపూర్/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/చెన్నూర్/లక్సెట్టిపేట/జన్నారం: జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా పార్టీ కార్యాలయాల వద్ద జాతీయ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకువస్తుందన్నారు. జైపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో 8మంది యువకులు రక్తదానం చేశారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరేశ్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నరేశ్ పాల్గొన్నారు. రామకృష్ణాపూర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, అబ్దుల్అజీజ్, గోపతిరాజయ్య, ఢీకొండ శ్యాంగౌడ్ పాల్గొన్నారు. జైపూర్‌లో మండల అధ్యక్షుడు ఫయాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు ఆసంపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు. మందమర్రిలో పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్, చెన్నూర్‌లో కాంగ్రెస్ నాయకులు హైకోర్టు న్యాయవాది శరత్‌కుమార్, చెన్న నారాయణ, చీర్ల సుధాకర్‌రెడ్డి, పాతర్ల నాగరాజు, చెన్నూరి శ్రీధర్, కడవండి మహేశ్, అన్వర్, మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు. జన్నారంలో పట్టణ అధ్యక్షుడు రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ రియాజోద్దీన్ పాల్గొన్నారు. లక్సెట్టిపేటలో మండల కాంగ్రెస్ నాయకులు ఆరీఫ్, అశోక్, సతీష్, రాజలింగు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

బెల్లంపల్లి: మాతృ హృదయ సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో గురువారం యాచకులు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రంజిత్, ఉపాధ్యక్షుడు కార్తీక్, కోశాధికారి శ్రీనివాస్, సలహాదారు వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.